సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 7 । ఆగస్టు । 2025




వైద్యం.. పూజ్యం
నిత్యం మంత్రోచ్ఛారణలతో మార్మోగిన సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల మూగబోయింది. దేవస్థానం వైద్యశాలలో వైద్యుడు లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది..

8లో



హోరాహోరీగా హాకీ పోటీలు
కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 15వ జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలు మూడో రోజు బుధవారం హోరాహోరీగా జరిగాయి.

1.18 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి బుధవారం సాయంత్రం 1,18,431 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న చెల్లుబోయిన వేణు, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలం దొమ్మేరులో బుధవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు కొమ్మన మణిబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కొల్లేపి మణి, సీతా నవీన్, ఇంటి వెంకటసాయి, సీతా అఖిల్, సీతా పోసి, పడాల వెంకటేష్, మావూడూరి తాతారావు, పడాల దిలీప్ తదితరులకు పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేతులమీదుగా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమని రమేష్, తాళ్లపూడి, చాగల్లు మండలాల కన్వీనర్లు కొలిశెట్టి నాగేశ్వరరావు, మట్టా వెంకట్రావు, సర్పంచ్ తానేటి కుమారి, నాయకులు ముదునూరు నాగరాజు, వేంపాటి సురేష్, సుంకర సత్యనారాయణ, పోసిన దేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన జోన్-2 అధ్యక్షుడిగా కారుమూరి



ఏలూరు (ఆర్ఆర్ పేట): వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్‌ను నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సునీల్‌కుమార్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు జోన్ -2 పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో సునీల్ పార్టీ యువజన విభాగానికి నాయకత్వం వహించనున్నారు. ఆయన నియామకంతో పార్టీ యువజన విభాగం మరింత బలోపేతమవుతుందని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి.

మంగళవారం వస్తే.. అప్పు కోసం పాకులాట

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వం ప్రతి మంగళవారం అప్పు కోసం పాకులాడే పరిస్థితిలో ఉందని, ఏడాది పాలనలో రూ.1.75 లక్షల కోట్ల అప్పు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో జరిగిన సీపీఐ 26వ జిల్లా మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేశంలో ఎన్‌డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారని, వారు ఏం సాధించారో ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఒక్క సెంట్ భూమి కూడా పేద ప్రజలకు ఇవ్వలేదన్నారు. విజయవాడలో 4 ఎకరాలు, విశాఖపట్నంలో 13 ఎకరాల రూ.వందల కోట్ల విలువైన భూములను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు.

కొబ్బరి అధిక దిగుబడే లక్ష్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మెరుగైన పద్ధతులకు ప్రోత్సాహం, కొత్త సాంకేతికత ద్వారా కొబ్బరి సాగులో దిగుబడి పెంచడమే తమ లక్ష్యమని కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు(సీడీబీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మంజునాథరెడ్డి అన్నారు. స్థానిక జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్-నిర్కా) సమావేశ మందిరంలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, రాష్ట్ర ఉద్యానవన శాఖ సౌజన్యంతో ఉద్యోగులకు సాంకేతిక సామర్థ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. సీడీబీ స్కీమ్స్, ఇంప్లిమెంటేషన్ రకాలు, ప్లాంట్ మెటీరియల్ వెరైటీస్, కోకోనట్ నారుమడుల తయారీ, బీమాపై డాక్టర్ మంజునాథరెడ్డి క్షుణ్ణంగా వివరించారు. కొబ్బరి సాగు, లోకల్, హైబ్రీడ్ రకాలు, తెగుళ్లు, పురుగులు తదితర అంశాలపై జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.దుర్గేష్, నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్, శాస్త్రవేత్తలు ఎ.కిరీటి, బి.నీరజ, కోకోనట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శరత్ వివరించారు.

ఎండమావుల్లో కష్టజీవులు

- డిప్యూటీ సీఎం కనికరం చూపాలంటున్న చిరుద్యోగులు
- శ్రీసత్యసాయి డ్రింకింగ్ ప్రాజెక్టు కార్మికుల ఆకలికేకలు
- 20 నెలలుగా అందని వేతనాలు
- గతంలో సమ్మె చేస్తే, రెండు నెలలు ఇచ్చి చేతులు దులుపుకొన్న కూటమి ప్రభుత్వం
- 85 గ్రామాలకు నిలిచిన సురక్షిత నీటి సరఫరా

వారు చెమట చిందిస్తేనే ఎన్నో గ్రామాలకు గొంతు తడుస్తుంది. కడుపు నిండక పస్తులున్నా.. కాయకష్టానికి ఏనాడూ వెనుకంజ వేయలేదు. తీరా నెలల తరబడి వేతనాలందక.. తమ కుటుంబాలను పోషించుకోలేని దుస్థితిలో తుదకు రోడ్డెక్కారు. అదిగో.. ఇదిగో అంటూ కూటమి సర్కార్ కాలయాపన చేస్తోంది మినహా.. వారి సమస్యకు ఓ పరిష్కారం చూపడం లేదు. శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల దీనగాథ ఇది.



కళ్లకు గంతలు కట్టుకుని సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలతో నిరసన తెలుపుతున్న కార్మికులు (ఫైల్)



పురుషోత్తపట్నంలోని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు

రాజమహేంద్రవరం రూరల్/సీతానగరం: చాలీచాలని జీతాలతో పని చేస్తూ.. ఓ నెల జీతం రాకపోతే అల్లాడిపోయే ఈ రోజుల్లో.. శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కాంట్రాక్టు ఉద్యోగులకు ఏకంగా 20 నెలలుగా వేతనాలు రాక, వారి కుటుంబాలు ఆకలి కేకలతో అలమటిస్తున్నాయి. కార్మికులకు వేతనాలు ఇవ్వాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ స్వయానా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధీనంలోనే ఉంది. అయినప్పటికీ ఆ చిరుద్యోగులపై మాత్రం ఎవరూ కనికరం చూపడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి.

సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో 2006లో శ్రీసత్యసాయి చారిటబుల్ ట్రస్టు శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల్లోని గోకవరం, సీతానగరం, కోరుకొండ, రాజానగరం, దేవీపట్నం మండలాల్లోని 85 గ్రామాల ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేలా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ స్వీకరించింది. ఈ ప్రాజెక్టును టెండర్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ ప్రతి నెలా కార్మికులకు జీతాలు చెల్లించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులో 53 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిపై నెలకు రూ.15 వేల వేతనానికి పనిచేస్తున్నారు. ఆ చిరుద్యోగులకు ప్రతి నెలా వేతనాలు ఇవ్వకపోవడంతో పాటు, అనారోగ్యం కలిగితే ఆస్పత్రిలో చూపించుకునేందుకు కనీసం ఈఎస్ఐ, పీఎఫ్‌కు కట్టాల్సిన సొమ్మునూ చెల్లించడం లేదు. ఇప్పటి వరకు 20 నెలల వేతనాల బకాయితో పాటు, 26 నెలలు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాల్సి ఉంది. పెండింగ్ జీతాలు ఇవ్వాలని గతేడాది అక్టోబర్ 17, 18 తేదీల్లో సమ్మె చేపట్టగా, ఆ సమయంలో కాంట్రాక్టర్ రూ.50 వేల చొప్పున అడ్వాన్స్ ఇచ్చారు. ఆ తర్వాత వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఈ ఏడాది మార్చి 17వ తేదీన లాలాచెరువులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద సమ్మె బాట పట్టారు. స్వయంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, జనసేన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలిసి కార్మికులతో చర్చించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించి, వారి వేతనాల బకాయిలు ఇప్పిస్తామని నమ్మించారు. దీంతో కార్మికులు అప్పుడు సమ్మె విరమించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే బలరామకృష్ణ కలిసి రూ.20 లక్షల చెక్కును కాంట్రాక్టర్ పేరున ఇవ్వగా, కార్మికులకు రెండు నెలలు వేతనాలు చెల్లించారు. అప్పటి నుంచి మరలా ఆ ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ కార్మికుల వేతన బకాయిలను పట్టించుకోలేదు. దీంతో చేసేది లేక గత నెల 8వ తేదీ నుంచి లాలాచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద కార్మికులు మరలా సమ్మెబాట పట్టారు. కార్మికులకు మద్దతుగా ప్రజా సంఘాల వారు, ఆయా గ్రామాల ప్రజలు సైతం మద్దతుగా నిలిచారు. కూటమి ప్రభుత్వ పెద్దల్లోనూ, అధికారుల్లోనూ ఎటువంటి చలనం లేదు. బిల్లులు పెట్టాం.. వచ్చేస్తాయంటున్నారే మినహా తమ ఆకలిబాధలు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

85 గ్రామాలకు నిలిచిన సరఫరా

శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కార్మికులు సమ్మె చేపట్టడంతో 85 గ్రామాలకు సురక్షిత మంచినీటి సరఫరా నిలిచిపోయింది. రాజానగరం, సీతానగరం, కోరుకొండ, జగ్గంపేట, దేవీపట్నం మండలాల్లోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు మంచినీటి కోసం డిమాండ్ చేస్తున్నా.. అధికారుల్లో మాత్రం చలనం కలగడం లేదు.

వేతనాల్లేక పస్తులు



గత 20 నెలలుగా వేతనాలు లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులకు విన్నవించినా బిల్లులు పెట్టామని చెబుతున్నారు కానీ, వేతన బకాయిలు మాత్రం రావడం లేదు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణం.

– ఉండుర్తి ఇస్సాక్, జనరల్ సెక్రటరీ, శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు వర్కర్స్ యూనియన్

ఉద్యోగ భద్రత కల్పించాలి



పెండింగ్‌లో ఉన్న 20 నెలల జీతాలు, 26 నెలలుగా కట్టని ఈఎస్ఐ, పీఎఫ్‌లను వెంటనే చెల్లించాలి. చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నాం. ప్రాజెక్టులో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాపై కనికరం చూపాలి.

– పి.శ్రీను, అధ్యక్షుడు, శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు వర్కర్స్ యూనియన్

దళిత ఎమ్మెల్యే నియోజకవర్గంలో దళితులకు రక్షణ కరవు

రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి వనిత

దేవరపల్లి: ఓ దళిత ఎమ్మెల్యే ఉన్న గోపాలపురం నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేదని రాష్ట్ర మాజీ హోం మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆవేదన వ్యక్తం చేశారు. నల్లజర్లలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. నల్లజర్ల మండలం దూబచర్లలో వైఎస్సార్ సీపీ కార్యకర్త దొబ్బిడి పెద్దిరాజు బడ్డీకొట్టును తొలగించాలంటూ పంచాయతీ కార్యదర్శి ఆశా ఆలేఖ్యతో టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. బడ్డీకొట్టు తమ జీవనాధారమని పెద్దిరాజు టీడీపీ నేతలను ప్రాధేయపడినా విడిచిపెట్టలేదన్నారు. పోలీస్ స్టేషన్‌కు పెద్దిరాజును, అతని భార్యను పిలిపించి భయపెట్టి బడ్డీకొట్టును తొలగించాలని చూశారని తెలిపారు. టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి వేధింపులను భరించలేక పెద్దిరాజు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్టు చెప్పారు. పోలీసులు, అధికారులు అక్కడే ఉన్నప్పటికీ, కనీసం ఆస్పత్రికి తీసుకెళ్లలేదని విమర్శించారు. తాడేపల్లిగూడెం, నల్లజర్ల, ఏలూరు ఆస్పత్రుల్లో వారం రోజులు మృత్యువుతో పోరాడిన పెద్దిరాజు బుధవారం మృతి చెందినట్టు ఆమె తెలిపారు. ఇప్పటి వరకు పోస్ట్‌మార్టం జరగనివ్వకుండా అడ్డుకున్నారని, కార్యకర్త ఇంటికి వెళదామన్నా 144 సెక్షన్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు.

జగన్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు లేదని వనిత అన్నారు. చంద్రబాబు మాజీ ఖైదీ కాదా? అని ప్రశ్నించారు. అధికారం ఎల్లప్పుడూ శాశ్వతం కాదనేది గుర్తుంచుకోవాలన్నారు. పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే భద్రత లేకుంటే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పులివెందులలో జెడ్పీటీసీ స్థానంలో ఓటమి చెందితే ప్రజల్లో వ్యతిరేకత బయటపడి వైఎస్సార్ సీపీ బలపడుతుందని దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ పర్యటనలను తలుచుకుని కూటమి నేతలు భయపడుతున్నారన్నారు. పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాలి వేణు, మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం, మహిళా విభాగం అధ్యక్షురాలు వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జన యోధుడు జక్కంపూడి

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు
- రాజమహేంద్రవరంలో ఘనంగా జయంతి వేడుకలు



మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి గణేష్, తలారి వెంకట్రావు, రౌతు సూర్యప్రకాశరావు, గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ మంత్రి, జన యోధుడు దివంగత జక్కంపూడి రామ్మోహన్‌రావు రాజకీయాల్లో చేసిన సేవలు, ప్రజలకు అందించిన సంక్షేమం నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమని, మార్గదర్శకమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ నివాళులర్పించారు. బుధవారం స్థానిక కంబాలచెరువు వద్దనున్న జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, తమలాంటి వారెందరికో రాజకీయపరంగా జక్కంపూడి రామ్మోహన్‌రావు మార్గదర్శకులన్నారు. రాజకీయ వేదికపై ఎందరినో శిష్యులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో జక్కంపూడి రామ్మోహన్‌రావు ఓ సంచలనమన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, తామంతా జక్కంపూడి రామ్మోహన్‌రావు మార్గదర్శకత్వంలో ఈ స్థాయిలో ఉన్నామన్నారు. సమస్యలపై ఎవరెళ్లినా రాత్రీపగలూ తేడా లేకుండా రోడ్డెక్కి పోరాడారని కొనియాడారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, తొలి నుంచీ తాను జక్కంపూడి అనుచరుడిగానే రాజకీయాల్లో కొనసాగినట్టు తెలిపారు. ఏపీ హెచ్‌బీసీ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, జక్కంపూడి రామ్మోహన్‌రావు జీవనం యువతకు ఆదర్శప్రాయమన్నారు.



కడియం మండలం బుర్రిలంకలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జక్కంపూడి రాజా

ఆయన బాటలోనే పేదల సేవలో కొనసాగుతున్నామన్నారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు తనయుడు, పార్టీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ, తండ్రి తమకు అశేష అభిమాన గణాన్ని ఆస్తిగా ఇచ్చారన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినా, అభిమానుల రూపంలో నిత్యం కళ్లముందే ఉంటున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు అనునిత్యం పాటుపడతామన్నారు. నేటికీ ప్రజల హృదయాల్లో ఆయన ముద్ర చెరగలేదన్నారు. రాష్ట్రంలో గడ్డుకాలం నడుస్తోందని, కూటమి ప్రభుత్వం ఎన్ని కష్టాలు పెట్టినా భరించాలని, తర్వాత రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజల కష్టాలన్నీ తీరుతాయని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ చోట్ల భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీతో పాటు, అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వృద్ధులకు దుస్తుల పంపిణీ, ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, వృద్ధాశ్రమాల్లో అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. బుర్రిలంకలో రక్తదాన శిబిరాన్ని పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా సందర్శించారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలకు వేళాయె..

- ఈ నెల 11 నుంచి 14 వరకూ పరీక్షలు
- విద్యార్థి అభ్యసనం మదింపునకు నిర్వహణ
- జిల్లాలో 2.42 లక్షల మంది విద్యార్థులు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యా సంవత్సరంలో విద్యార్థి అభ్యసన మదింపునకు విద్యాశాఖ ఏటా ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను గతేడాది నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ 1, 2, 3, 4గా వ్యవహరిస్తున్నారు. 2025- 26 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో తొలి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 (శాంప్) ఈ నెల 11 నుంచి నిర్వహించనున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మక విధానంలో 'క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్'ను ప్రవేశపెట్టారు. ఇదే విధానాన్ని ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ కొనసాగిస్తున్నారు. గత విద్యా సంవత్సరం 1-8 తరగతుల వరకూ సీబీఏ విధానం అమలు చేయగా, ఈ ఏడాది 9వ తరగతికి కూడా సీబీఏ విధానాన్ని తీసుకొచ్చారు. కేవలం 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఫార్మేటివ్-1 పరీక్షలను జరపనున్నారు.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం

ప్రస్తుత విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభమైంది. ముందుగా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు ఈ నెల 4 నుంచి నిర్వహించాల్సి ఉండగా, అసెస్‌మెంట్ బుక్‌లెట్స్ జిల్లాకు చేరుకోవడం ఆలస్యం కావడంతో ఈ నెల 11కు వాయిదా వేశారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సిలబస్‌తో పాటు, 6వ తరగతికి రెడీనెస్ ప్రోగ్రామ్‌పై పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షల ద్వారా అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటు, పక్కా బోధనతో వారిలో సామర్థ్యాలను వెలికితీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్-1, 3, ఎస్ఏ 2కు ఫార్మేటివ్‌కు బదులుగా సీబీఏ విధానంలో నిర్వహిస్తుండగా, ఎఫ్ఏ 2, 4, ఎస్ఏ 1 పాత విధానంలోనే నిర్వహించనున్నారు. 10వ తరగతికి నాలుగు ఎఫ్ఏలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు పాత విధానంలో అమలు చేస్తారు.

బైలింగ్వల్ ప్రశ్నపత్రాలు

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్వల్ విధానంలో ఉంటుంది. విద్యార్థికి ఇంగ్లిష్‌లో ప్రశ్నపత్రం అర్థం కాకుంటే తెలుగులో చదివి ప్రశ్నను అర్థం చేసుకునేందుకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి బైలింగ్వల్ ప్రశ్నపత్రాలను ప్రవేశపెట్టారు. ప్రశ్నపత్రంలోని 10 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో, ఐదు ప్రశ్నలు రాత పూర్వక విధానంలో ఇస్తారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. మెకానికల్.. అండర్‌స్టాండింగ్.. అప్లికేషన్ (ఎంయూఏ) ప్రశ్న పత్రం ఉంటుంది. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. సీబీఏ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను ఓఎంఆర్ షీట్లలో నింపాల్సి ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మాత్రం రాతపూర్వక సమాధానాలు రాస్తే సరిపోతుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లావ్యాప్తంగా జరగనున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఏడాది నుంచి పరీక్షలన్నింటికీ బుక్‌లెట్‌లో సమాధానాలు రాయాలి. 19 మండలాల్లో అన్ని స్కూళ్లకు బుక్‌లెట్లు అందించాం. దీనికి సంబంధించిన వివరాలన్నీ ప్రధానోపాధ్యాయులకు వివరించాం. ముందుగానే ఈ పరీక్షలపై అవగాహన కల్పించాం.

– కె.వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పుగోదావరి జిల్లా

తరగతులు	ప్రభుత్వ	ప్రైవేట్	మొత్తం
1-5	30,180	76,657	1,06,837
6-10	62,572	72,855	1,35,427
మొత్తం విద్యార్థులు			2,42,264

19 మండలాల్లో స్కూళ్ల వివరాలు

మొత్తం ప్రభుత్వ స్కూళ్లు	956
ఒకటి నుంచి ఐదు తరగతులు	716
యూపీ స్కూళ్లు	34
ఆరు నుంచి పది హైస్కూళ్లు	206
మొత్తం ప్రైవేట్ స్కూళ్లు	588
ఒకటి నుంచి ఐదు వరకు	147
యూపీ స్కూళ్లు	232
ఆరు నుంచి పది వరకు	209

క్లుప్తంగా

11న 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ మేళా'

బాలాజీచెరువు (కాకినాడ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల పరిధిలోని వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటీస్ ఖాళీల భర్తీని ఈ నెల 11న చేపడుతున్నట్లు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.వేణుగోపాలవర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 9 గంటలకు ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆగస్టు–2025 'ప్రైమ్ మినిస్టర్ అప్రెంటీస్ మేళా' నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఉన్న ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్ మరియు సిబ్బంది వారికి కావాల్సిన అంప్రెంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో శిక్షణ పూర్తి చేసుకుని, ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఒక జత జిరాక్స్ కాపీలను తీసుకుని మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

అనధికార పురుగు మందుల గోడౌన్‌పై దాడులు



బావాజీపేటలో పురుగు మందుల గోడౌన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

గోకవరం: మండలంలోని బావాజీపేట గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఎరువులు, పురుగు మందుల గోడౌన్‌పై వ్యవసాయ శాఖ, రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గ్రామంలో రామ్‌విజయ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన నగిరెడ్డి నాగమోహన్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా అనధికారికంగా గోడౌన్‌లో పురుగు మందులు నిల్వ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు గోడౌన్‌పై దాడులు నిర్వహించి సుమారు రూ.10,33,239 విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. గోడౌన్‌కు సీల్ వేసి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎస్.లక్ష్మీనారాయణ, సిబ్బంది ఎస్‌కే వల్లీ, మండల ఏఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

వైద్యం.. పూజ్యం

- అస్తవ్యస్తంగా స్మార్త ఆగమ పాఠశాల నిర్వహణ
- విద్యార్థులకు కనీస వైద్యం కరవు
- వైద్యుడు లేక వచ్చిన దుస్థితి



సెలవు ప్రకటించడంతో వెలవెలబోతున్న సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల



ఆగమ పాఠశాలలో విద్యార్థులను పరామర్శిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ (ఫైల్)

అన్నవరం: నిత్యం మంత్రోచ్ఛారణలతో మార్మోగిన సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల మూగబోయింది. ఇక్కడి విద్యార్థులు అనారోగ్యం బారిన పడడం, దేవస్థానం వైద్యశాలలో వైద్యుడు లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది.. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన మధ్య పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వచ్చింది.. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా, రూ.175 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న అన్నవరం దేవస్థానం అధికారులు సరైన వైద్యం అందించలేక విద్యార్థులను ఇంటికి పంపివేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దేవస్థానం వైద్యశాలలో నెల రోజులుగా వైద్యుడు లేకపోయినా ఎవరూ పట్టించుకోకపోవడం సమస్యకు కారణమైంది.

గతమెంతో ఘనం

అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్మార్త ఆగమ పాఠశాలను వ్రత మండపాల వద్ద చిన్న భవనంలో సుమారు ఐదేళ్లు నిర్వహించారు. ఆ తరువాత సత్యగిరిపై పది కరాల విశాల ప్రాంగణంలో రూ. 4 కోట్లతో పాఠశాల నిర్మించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2022 ఆగస్టు 13న శ్రీసత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల కొత్త భవనాలు ప్రారంభమయ్యాయి. అప్పటి ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ పాఠశాలను ప్రారంభించారు. ఐదేళ్లు చదువు పూర్తి చేసిన విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాలను ఆయన అందజేశారు. ఈ పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు దేవస్థానంలో పరిచారకులు, అర్చకులు, వ్రత పురోహితులుగా నియమిస్తామని కూడా ప్రకటించారు.

ఇప్పుడు అస్తవ్యస్తం

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ స్మార్త పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అనుభవం లేని అధికారులకు నిర్లక్ష్యం కూడా తోడైంది. గతేడాది విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే రత్నగిరిపై ప్రత్యేక క్యాంప్ నిర్వహించి వైద్యం అందించారు. అటువంటి ప్రయత్నం ఈసారి చేయలేదు. విద్యార్థులకు అనారోగ్యం సాకుతో సత్యగిరిపై నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాలకు వారం రోజులు సెలవు ప్రకటించారు. ఎనిమిది మంది విద్యార్థులు గత గురువారం తీవ్ర అస్వస్థతతో తుని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందడం, వారిని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌తో సహా పలువురు ప్రముఖులు పరామర్శించిన విషయం తెలిసిందే. ఆ తరువాత మరో ముగ్గురిని జ్వరం కారణంగా తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్యం కుదుటపడడంతో శుక్రవారం డిశ్చార్జి చేశారు. గత శనివారం మరో నలుగురికి తీవ్ర జ్వరం రావడంతో దేవస్థానం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దాంతో పాటు మరి కొంతమంది విద్యార్థులకు జ్వరంగా ఉండడంతో అందరికీ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆగమ పాఠశాలకు సెలవు ఇచ్చి విద్యార్థులను వారి ఇళ్లకు పంపించేశారు.

తల్లిదండ్రుల ఆందోళనతో సెలవు ఇచ్చాం



సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న వార్తలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తామని చెప్పడంతో సెలవు ఇచ్చాం. దేవస్థానం వైద్యశాలలో వైద్యుడిని నియమించేందుకు డీఎంహెచ్‌ఓకు లేఖ రాశాం. వారు వైద్యుడిని నియమిస్తే నిబంధనలను అనుసరించి జీతభత్యాలు చెల్లిస్తాం. అంతవరకూ తాత్కాలికంగా వైద్యుడిని ఆసుపత్రిలో కనీసం ఉదయమైనా పనిచేసేలా నియమించాలని కలెక్టర్‌ను కోరతాం.

–వి.సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

వైద్యాధికారి లేక..

దేవస్థానం ఆసుపత్రిలో వైద్యాధికారిగా పనిచేసిన శ్రీకాంత్‌కు రౌతులపూడి పీహెచ్‌సీలో వైద్యాధికారిగా ఉద్యోగం రావడంతో నెల రోజుల కిందట ఉద్యోగానికి రాజీనామా చేశారు. వెంటనే ఆయనను ఈఓ రిలీవ్ చేశారు. కొత్త వైద్యుడిని డీఎంహెచ్‌ఓ నియమించాల్సి ఉంది. ఆ వైద్యునికి జీతభత్యాలు దేవస్థానం చెల్లిస్తుంది. కొత్త వైద్యుడి నియామకం అయ్యేవరకూ తాత్కాలికంగా దగ్గరలోని పీహెచ్‌సీ నుంచి డాక్టర్ వచ్చి విధులు నిర్వహించేలా ఏర్పాటు చేయాలి. కానీ అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోక ఇటు ఆగమ పాఠశాల విద్యార్థులే కాకుండా, దేవస్థానానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దేవస్థానం ఆసుపత్రిలో ఉన్న ఫార్మసీ సూపర్‌వైజర్, ఇతర సిబ్బంది వారికి తెలిసిన వైద్యం చేస్తున్నారు. తక్షణం దేవస్థానం వైద్యశాలలో వైద్యాధికారిని నియమించాలి. కనీసం వారానికి ఒకసారి డీఎంహెచ్‌ఓ లేదా ఇతర పీహెచ్‌సీ వైద్యులు ఆగమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి – కాకినాడ టౌన్ మధ్య ఈ నెల 8, 10 తేదీల్లో రెండు ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. చర్లపల్లి – కాకినాడ టౌన్ (07031) ఈ నెల 8వ తేదీ శుక్రవారం బయలు దేరుతుందన్నారు. కాకినాడ టౌన్ – చర్లపల్లి (07032) ఈ నెల 10వ తేదీ ఆదివారం బయలు దేరుతుందని తెలిపారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యంతో ఉన్న లారీ

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక ఆటోనగర్ సమీపంలో అనధికారికంగా తరలిస్తున్న 15,190 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి కాకినాడ పోర్టుకు లారీలో రవాణా చేస్తున్న వీటి విలువ రూ. 6,98,740గా ఎంఎస్‌ఓ బాపిరాజు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడుకు చెందిన లారీ డ్రైవర్ తంగిరాల ఏడుకొండలును అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నామని రాజానగరం పోలీసులు తెలిపారు. అతని వద్ద లభించిన ఫోన్ ఆధారంగా ఈ రవాణాకు సూత్రధారి మొహ్మద్ ఆలియాగా తెలుస్తుందన్నారు. 6ఏ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పిఠాపురంలో లారీ చోరీ

- రూ.30 లక్షల విలువైన ఆయిల్ ప్యాకెట్లు మాయం
- తుని వద్ద లారీని వదిలి వెళ్లిన అగంతకులు



చోరీకి గురైన లారీ

పిఠాపురం: ఆయిల్ లోడు లారీ మాయమైన సంఘటన పిఠాపురంలో మంగళవారం రాత్రి కలకలం రేపింది. బుధవారం ఉదయం ఆ లారీ తుని సమీపంలో దొరికినప్పటికీ లారీలో ఉండాల్సిన సుమారు రూ.30 లక్షల విలువైన ఆయిల్ ప్యాకెట్లు మాయమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, లారీ యజమాని కథనం ప్రకారం.. పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయం వద్ద నివాసముంటున్న డి.అప్పారావు రాజులుకు చెందిన లారీ మంగళవారం ఉదయం కాకినాడలోని ఒక ఆయిల్ కంపెనీలో ఆయిల్ ప్యాకెట్‌ల లోడుకు వెళ్లింది. సాయంత్రానికి లోడు వేసుకుని అన్లోడ్‌కు బయలు దేరాల్సి ఉండగా, లారీ డ్రైవర్‌కు అత్యవసర పని ఉండడంతో లారీ యజమాని మరో తాత్కాలిక డ్రైవర్‌ను మాట్లాడుతున్నారు. ఆ తాత్కాలిక డ్రైవర్ తాను బుధవారం తెల్లవారుజామున బయలు దేరుతానని చెప్పడంతో లారీని తెచ్చి పిఠాపురంలో కుంతీమాధవ స్వామి ఆలయం వద్ద ఉన్న లారీ యజమాని ఇంటి దగ్గరలో సీసీ కెమెరాలు ఉన్నచోట పార్కింగ్ చేశారు. తెల్లవారు జామున తాత్కాలిక డ్రైవర్ వచ్చి తీసుకునే విధంగా లారీ తాళాలను లారీలోనే పెట్టి ఆ విషయాన్ని డ్రైవర్‌కు చెప్పి యజమాని తన ఇంట్లో నిద్రించాడు. బుధవారం తెల్లవారుజామున తాత్కాలిక డ్రైవర్ వచ్చి చూడగా, లారీ కనిపించకపోవడంతో యజమానితో పాటు చుట్టుపక్కల వారు అవాక్కయ్యారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాల ఆధారంగా లారీ గొల్లప్రోలు వైపునకు వెళ్లినట్టు గుర్తించారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలించగా, మాయమైన లారీ టోల్‌గేట్ వద్ద ఆగి టోల్ ఫీజు చెల్లించి వెళ్లినట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతను ఇచ్చిన సమాచారంతో లోడుతో ఉన్న లారీని శంఖవరం దగ్గర మరో వ్యక్తికి అప్పగించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు బృందాలుగా లారీ కోసం తుని, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో వెతకగా తుని సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన లారీ నిలిపి ఉండడం గమనించారు. అయితే లారీలో ఉండాల్సిన ఆయిల్ ప్యాకెట్లు మాత్రం ఖాళీ అవడాన్ని పోలీసులు గుర్తించారు. లారీలో ఉన్న ఆయిల్ లోడును మరో లారీలోకి ఎక్కించుకుని ఈ లారీని వదిలేసి ఉంటారని భావిస్తున్నారు. బాధిత లారీ యజమాని ఫిర్యాదు మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

ఆడపిల్ల పుట్టిందని కాపురానికి రావద్దంటూ వేధింపులు

- బాధితురాలికి న్యాయం చేయండి
- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉభయ రాష్ట్రాల ఛైర్‌పర్సన్ లక్ష్మి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఖండవల్లి లక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆడపిల్ల పుట్టిందని భార్యను కాపురానికి రావద్దంటూ వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తమామలను వెంటనే అరెస్ట్ చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఛైర్ పర్సన్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నరేంద్రపురం గ్రామానికి చెందిన దేగల గంగాధర్, దేగల వరలక్ష్మిల కుమార్తె ప్రగడ వర్ధినిలక్ష్మికి గోకవరం మండలం వీర్లంకపల్లి గ్రామానికి చెందిన ప్రగడ నాగేంద్రబాబు, ప్రగడ మంగాదేవిల కుమారుడు ప్రగడ నాగ దుర్గారావుకు 2022లో వివాహం చేశారన్నారు. వివాహ సమయంలో కట్నంగా రెండెకరాల పొలం, రూ.30 లక్షలు, 30 కాసుల బంగారం, రూ.5 లక్షల ఆడపడుచు కట్నంగా ఇచ్చినట్లు వివరించారు. 18 నెలలు కాపురం సక్రమంగా జరిగిందని, తర్వాత ఆడపిల్ల పుట్టిందని కాపురానికి రావద్దంటూ భార్య ప్రగడ వర్ధినిలక్ష్మిని భర్త నాగ దుర్గారావుతోపాటు అత్తమామలు వేధింపులకు గురిచేస్తూ ఇంటి నుంచి బయటకు గెంటేశారని వివరించారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. అయితే తన కుమార్తెకు తండ్రిని చూపించాలనే ఉద్దేశంతో ప్రగడ నాగ దుర్గాప్రసాద్ ఇంటికి కుమార్తెతో వెళ్లగా భర్త అత్తమామలు మరి కొంతమంది కలసి వర్ధిని లక్ష్మిపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించి నాగ దుర్గాప్రసాద్ పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. పెళ్లయినప్పటి నుంచి ఏ పనీ లేకుండా ఇంట్లోనే ఉంటూ బెట్టింగ్ గేమ్‌లు ఆడుతూ నష్టపోయి తనకు మరింత అదనపు కట్నం కావాలని వేధింపులకు గురి చేసేవాడని ఆరోపించారు. బాధిత మహిళ వర్ధిని లక్ష్మికి న్యాయం చేసి ఆమె కాపురం నిలబెట్టాలని ఖండవల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. పసిపాపతో ఉన్న తన కుమార్తెకు న్యాయం చేయాలని వర్ధిని లక్ష్మి తల్లిదండ్రులు వేడుకున్నారు. న్యాయం జరగకపోతే హ్యూమన్ రైట్స్, మహిళా సంఘాలతో ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు.

'రాష్ట్రీయ బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 15 తుది గడువు
- అసాధారణ ప్రతిభ కనబర్చిన చిన్నారులకు అవకాశం



రాయవరం: కేంద్ర ప్రభుత్వం ఏటా 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' పేరుతో అసాధారణ ప్రతిభ కనబర్చిన బాల బాలికలకు అవార్డులను అందజేస్తోంది. బాలల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులను ఇస్తోంది. ఈ మేరకు విభిన్న రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన బాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. సామాజిక సేవ, అత్యంత ధైర్య సాహసాలు, క్రీడలు, కళలు, సంస్కృతి, శాస్త్ర సాంకేతిక విద్య, పర్యావరణ పరిరక్షణ, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు తదితర రంగాల్లో రెండేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అసాధారణ విజయాలు సాధించి ఉండాలి. భారత సంతతికి చెంది, దేశంలో నివసిస్తున్న బాలలు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

అవార్డ్. జీవీ. ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్క్రీనింగ్ కమిటీ ప్రతినిధులు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను రూపొందిస్తారు. అర్హత పొందిన దరఖాస్తుదారుల్లో అత్యుత్తమ ప్రతిభ కలిగిన బాలలను ఎంపిక చేసి తుది జాబితాను కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటిస్తారు. ఈ ఏడాది జూలై 31వ తేదికి అభ్యర్థుల వయసు ఐదు నుంచి 18 ఏళ్లు ఉండాలి. అర్హత ఉండి ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రయోజనాలు ఇలా..

ఎంపికైన వారికి 2026 జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే ఉత్సవాల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా జ్ఞాపిక, ధ్రువపత్రం, ప్రశంసాపత్రం అందజేస్తారు. రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన వారిని ప్రధాన మంత్రి అభినందిస్తారు. గణతంత్ర దినోత్సవ ర్యాలీలో భాగస్వాములను చేస్తారు. భవిష్యత్తులో విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో అవార్డు పొందిన వారికి ప్రాధాన్యమిస్తారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 15వ జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలు మూడో రోజు బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఈ మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, కోశాధికారి థామస్ పీటర్, టోర్నీ కో–ఆర్డినేటర్ రవిరాజు పర్యవేక్షించారు. పోటీలను మేజర్ స్పాన్సర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు బి.కిరణ్‌కుమార్, పి.త్రినాథ్, ఎం.రవికుమార్ ప్రారంభించారు. అస్సాం, మణిపూర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మణిపూర్ 3–1 స్కోర్‌తో, కేరళ, ఉత్తరాఖండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 7–0 స్కోర్‌తో విజయం సాధించగా, హిమాచల్‌ప్రదేశ్, బిహార్ మధ్య జరిగిన మ్యాచ్ 1–1 స్కోర్‌తో డ్రాగా అయ్యింది. తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 5–0 స్కోర్‌తో, మధ్యప్రదేశ్, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4–0 స్కోర్‌తో విజయం సాధించాయి. హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 1–1 స్కోర్‌తో ఇరు జట్లు సమానం కావడంతో నిర్వాహకులు డ్రాగా ప్రకటించారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 7–1తో విజయం సాధించింది.

వివాహేతర సంబంధం కొనసాగించలేదని కాల్పులు

నిందితుడి అరెస్ట్

అన్నవరం: శంఖవరం మండలం, పెదమల్లాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని శృంగధార గ్రామంలో ఈ నెల 3న మణికుమార్ (గబ్బర్‌సింగ్) అనే వ్యక్తి భార్యాభర్తలపై నాటు తుపాకీతో కాల్పులు జరపడానికి ప్రధాన కారణం వివాహేతర సంబంధం కొనసాగించలేదనే కక్షే కారణమని పోలీసు విచారణలో తేలింది. బుధవారం అన్నవరం పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శృంగధార గ్రామానికి చెందిన కాకూరి చంద్రయ్య (చంద్రబాబు) భార్య సూర్యావతితో అదే గ్రామానికి చెందిన మణికుమార్‌కు వివాహేతర సంబంధం ఉంది. కొంత కాలం ఇద్దరూ కలిసే ఉన్నారు. అయితే ఇటీవల సూర్యావతి తన భర్త చంద్రయ్య వద్దకు వచ్చేసింది. తనను వదిలేసి వచ్చిందని సూర్యావతిపై మణికుమార్ కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 3న అర్ధరాత్రి చంద్రయ్య, సూర్యావతి వారి ఇంటి అరుగుపై నిద్రపోతుండగా మణికుమార్ వారిపై నాటు తుపాకీతో కాల్పులు జరపగా, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని డీఎస్పీ వివరించారు. మణికుమార్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం పెదమల్లాపురం వద్ద ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టుకు తరలించినట్టు డీఎస్పీ వివరించారు.

కువైట్‌లో పొన్నమండ వాసి మృతి

- రెండు నెలల తర్వాత స్వగ్రామానికి మృతదేహం
- జూన్ 1న ఆ దేశంలో ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

రాజోలు/ అమలాపురం రూరల్: కువైట్‌లో రెండు నెలల క్రితం జరిగిన ఏసీ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో తొమ్మిది మంది అగ్నికి ఆహుతయ్యారు. గుర్తుపట్టలేనంతగా మృతదేహాలు కాలిపోయాయి. తొమ్మిది మంది మృతుల్లో రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన కడలి దుర్గాసంతోష్ ఉన్నట్టు గుర్తించారు. అయితే మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా ఉండడంతో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చొరవతో మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో దుర్గాసంతోష్ కుటుంబ సభ్యులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. డీఎన్ఏ నివేదికలను కువైట్‌లోని ఇండియన్ ఎంబసీకి పంపించారు. ఆ నివేదిక ద్వారా దుర్గాసంతోష్ మృతదేహాన్ని గుర్తించి కార్గో విమానం ద్వారా హైదరాబాద్, అక్కడి నుంచి ఏపీఎస్ఆర్‌టీ ద్వారా స్వగ్రామం పొన్నమండ తీసుకు వచ్చారు. కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సంస్థ చొరవతో కుమారుడి మృతదేహం స్వగ్రామానికి వచ్చిందని మృతుడి తండ్రి సూర్యనారాయణ, చిన్నాన్న ఆదినారాయణ తెలిపారు. కోనసీమ వాసి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు జిల్లా ఎస్పీ కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సంస్థ వికాస పీడీ కె.లచ్చారావు, మేనేజర్ జి.రమేష్, మహిళా కానిస్టేబుల్ బి.సఫియా, హెడ్ కానిస్టేబుల్ కె.సత్తిబాబులను కలెక్టర్ మహేష్ కుమార్ అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్



PLOT FOR SALE

■ కేవలం 7.5 లక్షలకే 25 సెంట్ల భూమి 100 ఎర్ర చందనం మొక్కలతో కలిపి స్పాట్ రిజిస్ట్రేషన్ మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎర్ర చందనం సాగు ఒక్కటే మార్గం. ✆ 96661 66407, 96031 84207 [B-2646]

■ రాజమండ్రి తూర్పు రైల్వేస్టేషన్ ఎదురుగా K.K.R గౌతం స్కూల్ దగ్గర 40X55 కొలతలతో W/F 245 చ॥గ॥లు స్థలం, GSL హాస్పిటల్ వెనుక సాయి నగర్ లో 200 చ॥గ॥లు 2 స్థలాలు అమ్మకమునకు కలవు. 98662 50279, 94926 69079, 93966 60652 [SCA25007015]



■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు.ఫ్రీరూం+భోజనం.Hyd.9666253675 [HA-16118]

■ స్వామి వివేకానంద గ్రూపు (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9502501122, 9573691122 [B-1275599]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్కై M/F వర్కర్స్ కా॥ భో+వ + జీతం 16-18 వేలు. ఏజెంట్లకు 5K కమీషన్. 9281465319/ 9515119570 [SCA25007009]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible] తేది.08.09.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని [illegible]

ఇ-వేలం తేది & సమయం : తేది.08.09.2025, మ॥02.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 08.09.2025, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 08.09.2025, మ॥ 12.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయబడినవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఏలూరు బ్రాంచ్, ఏలూరు. మెస్సర్స్ ఈశ్వర్ సంకల్ప్ డెవలపర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్ట్‌నర్ : శ్రీ అరిమండ దుర్గా రామకృష్ణారెడ్డి, తండ్రి : అరిమండ కనక రెడ్డి & లేటు శ్రీమతి అరిమండ కళ్యాణి, భర్త: అరిమండ దుర్గా రామకృష్ణారెడ్డి. బకాయి మొత్తం : రూ.18,29,94,801.74 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	[illegible] తూర్పుగోదావరి జిల్లా, [illegible] రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, [illegible] 10288.55 చ॥గ॥ల [illegible] 5967.36 చ॥గ॥ల [illegible] 3200 చ॥గ॥ల [illegible] "ఈశ్వర్ సంకల్ప్ హోమ్స్" నందు 69 ఫ్లాట్స్ [illegible] 89045 చ॥అ॥ల [illegible] 5520 చ॥అ॥ల కార్ పార్కింగ్ (69 ఫ్లాట్స్‌కు ఒక్కో ఫ్లాట్‌కు 80 చ॥అ॥ల [illegible]) [illegible] మొత్తం 110 ఫ్లాట్లలో, [illegible] 69 ఫ్లాట్లు బ్యాంకునకు తనఖా పెట్టబడ్డాయి. బ్లాక్-బి లో: క్రింది అంతస్తు నందు ఫ్లాట్ నెం.101,102,103,104,106, మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం. 201, 202, 203, 204, 206, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.501, 502, 503, 504, 505, 506. బ్లాక్-డి లో: మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.201,203,204,206, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 401, 402, 403, 404, 405, 406. బ్లాక్-ఇ లో: క్రింది అంతస్తు నందు ఫ్లాట్ నెం.101,102,103,104,105,106, మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.202, 205, రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.301,306, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.401, 402, 403, 404, 405,406, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.501, 502, 503, 504, 505, 506. బ్లాక్-ఎఫ్ లో: మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.201,202,203,204,206, రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.301,303,304,306, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.401,402,403,404,405,406, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.503. ఎమినిటీస్ బ్లాక్ లో: క్రింది అంతస్తు నందు ఫ్లాట్ నెం.102, మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.201, రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.302, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.401, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.502.	రూ. 18.43 కోట్లు	రూ. 1.84 కోట్లు

ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.06.09.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8331011695.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 500.00 లక్షల వరకు ఉన్న వాటికి రూ.5,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ : "https://baanknet.com/eauction-psb", హెల్ప్ డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051. ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 01-08-2025, ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్